# భయ్యాగారి కాఫీ

రేణుకా అయోలా



"భయ్యా మావయ్య కాఫీ తాగడం మానేసాడుట" ఇదో పిడుగులాంటి వార్త, అందరూ అవ్వాక్కయ్యారు. ఆయన కాఫీ మానేసాడంటే విన్నవాళ్ళెవ్వరికీ నమ్మబుద్ధి వెయ్యదు. అసలు కాఫీ కాస్తే భయ్యానే కాయాలి అన్నంత ప్రసిద్ధి చెందాడు. మీకు అనుమానం రావచ్చు. ఏమిటి అతను హోటల్ నడుపుతున్నాడా? లేక భార్య పిల్లలు లేరా ? అని.... కాకపోతే ఏడు అగ్రహారాలకి అతని పేరే ఎందుకు మారుమోగుతుంది?

అరవయ్యో వడిలో పడ్డా ఆయనకున్న స్పీడూ, చురుకుదనం గమనిస్తే, మీరు ఒప్పుకుంటారు. చింతపిక్కలా కుంగకుండా, వంగకుండా దబదబా పనులు చేసే అతను అతనికే సాటి అని...

నలభై ఏళ్ళ వయసులో ఒకసారి భార్య కాఫీ గింజలు సరిగా వేయించలేదని, పుట్టింటికి ఆరునెలలు పంపించేసిన ప్రభుద్దుడాయన,

కాఫీ అంటే ప్రాణం మరి.

పశువుల సావిడిలో కాఫీకోసం ఓ గేదె, ఓ ఆవు...దేవుడికి నైవేద్యంపెట్టాలి అంటే ఆవు పాలతోటే...ప్రతిపనికీ ఒకపద్ధతి,ఒకక్రమశిక్షణ.

ఆ ఊరిలో పది ఎకరాలు ఉన్న బ్రాహ్మడు అతడొక్కడే. అందరూ తమ ఆస్తులని ఎంతో కొంతకి తెగనమ్మి, పొట్ట చేత పట్టుకొని, దేశాలు పట్టిపోయారు. అతనొక్కడే ఆ ఊళ్ళో స్థిరపడి అజమాయిషీ చెలాయించే వాడు. ఖంగుమన్న గొంతుకతో "ఏరా పాలిగా!" అన్న కేక పెడితే ఆ గ్రామం గజగజలాడుతుంది.

"ఏరా అంట్లసిబ్బి వెధవ" అంటూ తిట్టుతోనే అందరినీ పలకరిస్తాడు.

"బుగతగారు పరాసికాలాడుతారు" అంటూ ఇష్టం లేకపోయినా సర్దుకుపోతుంటారు అందరూ. మొదట్నుంచీ అందరినీ ఒక తాటిమీద నడిపించారు. ఆ ఇంటి ఆడవాళ్ళు భార్య గాని, తల్లిగాని ఆయన ముందు నోరు ఎత్తడానికి వీలులేదు. లేక లేక పుట్టిన కొడుకు బాగా చిన్నవాడు. వాణ్ణి అయిదవ తరగతిలోనే పట్నం తీసుకుపోయి హాస్టల్‌లో పడేసారు.

"అంట్లసిబ్బి వెధవ, ఇక్కడుంటే ఏం బాగు పడతాడూ?" చిన్నవాడు, పసివాడు, ఒక్కగానొక్క కొడుకు దూరమై ఏడుస్తున్న భార్యని చూసి అన్నాడు.

అసలు ఇతనికి భయ్యా అన్న పేరు ఎందుకొచ్చిందీ? అసలుపేరు నిక్షేపంలా 'సీతా రాముడు' వాళ్ళ అమ్మమ్మ ఏరి కోరి మరీ పెట్టుకుంది. చక్కగా రాముడిలా ఏకపత్నీ వ్రతుడుగా ఉండాలనీ....ఇది విన్న "ఆ ఏక పత్నీ వ్రతుడే.... కాఫీని సవితిగా తెచ్చుకొన్నాడు" అనుకొనేది ఎవరూ లేనప్పుడు, గొంతు పెంచి పెళ్ళైన పదేళ్ళకి వంట ఇంట్లో ఒకర్తీ భయ్యా మామయ్య భార్య.... కాంతం....

ఒకసారి కాశి వెళ్ళినప్పుడు ఓ హిందీవాడు రాముడు మావయ్య వెంట పడ్డాడు భయ్యా అంటూ..అతనికి సత్రంలో దిగినప్పుడు స్నేహపూర్వకంగా ఇంటినుంచి తెచ్చుకొన్న కుంపటిలో కాఫీ కాచి ఇవ్వగానే ఆ కాఫీ తాగి "భయ్యా మీరు కాచిన కాఫీ అద్భుతం" అంటూ మెచ్చుకున్నాడు. భయ్యా అన్న ముక్కే అర్థం అయింది. మిగిలిందంతా వాడిచేష్టల ద్వారా తాను ఇచ్చిన కాఫీని మెచ్చు కుంటున్నాడని అర్థం అయింది. అప్పట్నుంచి వాడు ఇతను ఎక్కడ కనపడ్డా "భయ్యా" అంటూ పలుకరించి నవ్వేవాడు... కాశీలో ఉన్న మూడునెలలూ.

అప్పటినుంచి ఇతనితో వచ్చిన వాళ్ళు కూడా తొలిలో ఇతనిని రాముడు భయ్యా అని అనేవారు. రాను రాను భయ్యాగా మారిపోయాడు.

మీకు ఇంత చెప్పి అతను కాఫీ కాచే విధానం చెప్పకపోతే మీరుఇలాగే అవాక్కయిపోతారు.... కాఫీ రుచి తెలియక.

పొద్దున్నే అయి దున్నర కల్లా ఠంచనుగా లేచిపోతాడు. పాలేరుకుర్రాడు అతని మంచానికి దగ్గరగా బొంత వేసుకొని పడుకోవలసిందే, ఒరేయి "అంట్లసిబ్బి వెధవ" లేవరా అంటూ వాడిని లేపుతాడు..... వాడు "లెగిసే ఉన్నానండీ"అంటాడు బుర్ర బర బర గోక్కుంటూ... లుంగీ ఎగకట్టి నోట్లో పందుపుల్ల పెట్టుకొని ఇత్తడి చెంబుతో నీళ్ళు పట్టుకొని ఆవుల శాలవైపు వెళతాడు. పేరుకే ఆ పాలేరుకుర్రాడు... పాలుకూడ అతనే తియ్యాలి. పెద్ద ఇత్తడి చెంబు నిండా నురగతో పాలు గుమ్మంలో పెట్టి.

ఏమే కుంపటి రాజెయ్యి అంటూ గావుకేక.... ఇంట్లో గ్యాస్ స్టవ్ ఉన్నా సరే కాఫీకి పాలు కుంపటిలో కాగాల్సిందే.... ఇంతలో మొఖం కాళ్ళు చేతులు కడుక్కొని, గావంచాతో వందసార్లు పాదాలు తుడుచుకొన్న తరువాత కాఫీ కలిపే కార్యక్రమం మొదలవుతుంది. రాత్రే వేయించి పెట్టుకున్న కాఫీ గింజలపొడి డబ్బా, దానిని వడగట్టడానికి తెల్లటి లుంగీముక్క, కాఫీ జల్లెడగాని, టీ జల్లెడగాని అసలు పనికిరావు.

మరిగిన నీళ్ళలో కాఫీపొడి వేసి, చల్లటి నీళ్ళు జల్లి మూతపెట్టి కాఫీ తేరాక, మరగకాచిన పాలు కుంపట్లో నుంచి కిందికి దింపి పాలల్లో ఓ చుక్క నీరు కలపకుండా అలాగే కాఫీ డికాక్షన్ అంతా వేసి కలిపి, కొంచెం గ్లాసులో పోసుకుని రుచి చూసేవాడు సరిగ్గా పాళ్ళు పడ్డాయా లేదా అని. కాఫీ రుచిలో ఏమాత్రం తేడా రాకూడదు. అలా శ్రద్ధగా తయారుచేసుకొన్న కాఫీ కంచు గ్లాసులోనే తాగాలి. ఇదీ కాఫీ తతంగం.

ఏ మాటకి ఆ మాటే చెప్పుకోవాలి. ఒకసారి భయ్యా మావయ్యగారి ఇంటి కాఫీ తాగితే మళ్ళా ఎక్కడా తాగబుద్ధి వెయ్యదు. ఎప్పుడో చుట్టం చూపుగా వెళ్ళిన మనమే ఆ కాఫీ రుచి మరిగితే, అంత శ్రద్ధగా తానే స్వయంగా చేసుకొన్న కాఫీ వదిలేసి ఇంకోళ్ళ చేతి కాఫీ ఎలా తాగుతాడు, ఇదీ విషయం.

మరి ఈ పిడుగులాంటి వార్త ఏమిటి? భయ్యా మావయ్య కాఫీ మానేయడం ఏమిటి?

ఎదిగొచ్చి ప్రయోజకుడైన కొడుకు అమెరికా వెళ్ళి స్థిరపడి, వీళ్ళని కూడా తీసుకు వెళుతున్నాడు. ఆరునెలలపాటు ఆవుల సావిడిని ఎవరు చూస్తారు; పాడిగేదె 'గౌరి' (ముద్దుపేరు), 'లక్ష్మి' (ఆవు) అన్నింటిని పాలేరుగాడికి అప్పచెప్పి, ఇంటికి తాళం పెడుతూ నిర్ణయం తీసుకున్నాడు.

"వెధవది కిరాస్తానీ దేశంలో పింగాణీ కప్పుల్లో 'ఎంగిలి మంగలం' కాఫీ తాగేకన్నా కాఫీ తాగడం మానే స్తాను" అన్నాడు శపథం పట్టినట్లు.

